# వనితాలోకం

## అలవాట్లు

“అబ్బబ్బా...యేమి అలవాట్లో నమ్మా యివి. పెందలకడ ఇంటికి రమ్మని ఎన్నిసార్లు చెప్పినా ఈయనకు రాత్రి ఎనిమిదయితే నేగాని ఇల్లు జ్ఞాపకం రాదు” అని విసుక్కొంటుంది పొరుగింటి ఇల్లాలు, నలుగురు బిడ్డలతల్లి విశాలాక్షి.

“ఏమి అలవాట్లో యేమిటో, పేత్తనాలకు వెళ్లవద్దనీ, మీయింట్లో ఇవాళ కూర లేమిటని ఇరుగు పొరుగువాళ్లను అడగవద్దనీ ఎన్నిసార్లు చెప్పినా యీ ఆడవాళ్లకు అర్థమయి చావడేం” అంటాడు ఆ ప్రక్కయింటి మిత్రుడు సుబ్బారావు.

సంసార జీవితంలో భార్యాభర్తలు రోజూ ఎదుర్కొనే అలవాట్ల సమస్య లివి. అలవాట్లు సంసార జీవితంలో చాలా ప్రధానపాత్ర నిర్వహిస్తవి. భార్య అలవాట్లు భర్త మనస్తత్వంమీదనూ, భర్త అలవాట్లు భార్యమీదనూ పనిచేస్తవి. వీటివల్ల ఒండొరుల ప్రేమానురాగాలు ఎక్కువయి సంసార జీవితం సుఖమయమైనా కావచ్చు. లేదా వాటివల్ల ఒకరిమీద మరొకరికి ద్వేషమూ విరక్తీ పుట్టుకొచ్చినా పుట్టుకు రావచ్చు.


విశాలాక్షి మనస్తత్వం యేమిటో? మధ్య తరగతిలో ఇటువంటి విశాలాక్షులు చాలా మంది వుంటారు. భర్త ఆఫీసునుంచి పెందలకడ యింటికి రావాలని భార్య ఎందుకు కోరుకుంటుంది? ఇంటికి వచ్చి భర్తలు తమ కేదో యింటిపని చేసిపెట్టాలని ఆశిస్తారా ఇట్టి మనస్తత్వంగల ఆడవాళ్లు? అలా ఆశించినా ఆశించవచ్చు. ఇంటి పనులంటే ఇంట్లోకి నీళ్లు తీసుకురావడం, ఇల్లు ఊడవడం వంటి పనులేనా యేమిటి? విశాలాక్షికి నలుగురు పిల్లలని చెప్పాను. నాలుగో పిల్ల నాలుగేండ్లది.

ఏ. యస్. అవధాని

ఒకనాడు విశాలాక్షి భర్త ఆఫీసుకు వెళ్లిన తరువాత ఆ నాలుగో పిల్ల మేడమెట్ల మీదనుంచి జారిపడ్డది. ఇంకా నయం! కుడి చెయ్యి మాత్రమే విరిగింది. విశాలాక్షి భర్త రంగారావు ఆవేళ ఉదయం పది గంటలకు ఆఫీసుకు వెళ్లి రాత్రి ఎనిమిదిన్నరకు ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి విశాలాక్షి ఆ పిల్ల చేతికి అమృతాంజనం రాచి వేడినీళ్ళ కాపు వేస్తున్నది. అది చూచేటప్పటికి రంగారావుకు గుండె ఆగిపోయినంత పనయింది. చెయ్యి బెణకడం కాదది. విరిగింది. భార్యకు ఆసంగతి చెప్ప లేదు. ఆమర్నాడు ఆ పిల్లను ఆస్పత్రికి తీసుకువెళ్లి కట్టు కట్టించేవరకూ అతనికి మనశ్శాంతి అనేది లేకపోయింది. ఇది చాలా సహజమైన విషయమే. ఆఫీసుకు వెళ్లేటప్పుడు ఇంట్లో అందరూ బాగానే వున్నారాయెను. ఇంటికి తిరిగి వచ్చేలోగా ఎవరికో యేదో ముంచుకువస్తుందని గాని, ఎవరికయినా ఏదైనా ప్రమాదం సంభవించివుండవచ్చుననే భయంగాని ఇంటినుంచి బయటికి వెళ్లే ప్రతి మగవాణ్ణీ ఎప్పుడూ వేధిస్తూ ఉండవలసినదేనా యేమిటి? అటువంటిదేమీ అవసరం లేదు. కాని, ఆఫీసుపని అయిపోయిన తరువాత కొంచెం త్వరగా మగవాడు ఇంటికి రావాలని ఆడది ఆశించడంలో తప్పేమిటి? అంటే మన పూర్వీకు లందరూ ఎప్పుడూ ఆడవాళ్లకు ఎదురుగా కూచునే వాళ్లా యేం? అదీకాక పగలంతా ఆఫీసులో పనిచేసిన తరువాత కొంచెంసేపు స్నేహితులతో కాలక్షేపం చెయ్యకపోతే మనస్సుకు ఉల్లాసం కలిగే ఆస్కారమేదీ? ఇక ఎప్పుడూ ఇల్లూ ఆఫీసూ - ఇవి రెండేనా యేం జీవితానికి కావలసినవి? జీవితానికి ఇంకా యేమీ అవసరం లేదా అని కొందరంటారు.

పైకి చాలా చిన్నవిగా కనిపించే యీ అలవాట్ల కారణంగా సంసారానికి చాలా కష్టనష్టాలు వాటిల్లుతూండడం మనం రోజూ చూస్తునే వుంటాము. కాని, ఈ అలవాట్లను మార్చుకొనడానికి చెప్పుకోతగ్గంత ప్రయత్నం మాత్రం జరుగుతున్నట్లు కనిపించదు.

పైన పేర్కొనబడిన ఉదాహరణల లోని మొదటి సంఘటన సంగతేమిటి? రంగారావు ఆఫీసునుంచి పెందలకడ ఇంటికి రావడానికి ఆక్షేపణ ఏమిటి? ఆఫీసులో పని ఎక్కువగా వుండి ఇంటికి సకాలంలో తిరిగి రాకపోతే అది వేరేసంగతి. ఒకవేళ ఆఫీసులో పని ఎక్కువగా వుండడమంటూ జరిగినా అది ఎప్పుడూ జరిగేవిషయంకాదు. అలాకాదు. ఆ ఉద్యోగ స్వభావమే అటు వంటిది. పొద్దున పదిగంటలనుంచీ రాత్రి ఎనిమిదిగంటలదాకా పనిచేయవలసి వుంటుం దని అనుకుందాము. అటువంటప్పుడు అయిదుగంటలు దాటిన తరువాత చేయవల సిన పనిని ఇంటికి తీసుకువెళ్లి చేస్తానని ఆఫీ సరుకు చెప్పవచ్చు. ఆఫీసరు ఒప్పుకో

# ★ అలవాట్లు ★

కావడమనేది కూడా సాధ్యమే. కాని సాధారణంగా జరిగే విషయం కాదు. పైగా ఆఫీసుపని చెయ్యడంతోపాటు నాకు మరో జీవితంకూడా ఉన్నది. నేను నిర్వర్తించవలసిన మరో ధర్మంకూడా ఉన్నది. వాస్తవానికి ఆ ధర్మనిర్వహణ ఉపాంగులలో ఈ ఉద్యోగం ఒకటి అనే దృష్టితో వ్యవహరించే ఉద్యోగి తన పై ఆఫీసరుకు యీ విషయం నచ్చచెప్పగలడు.

ఆ విషయం అలా ఉంచండి. ఇక్కడ ఆలోచించదగిన మరొక విషయంకూడా వున్నది. ఆఫీసుపని చేసేటప్పుడు కొందరు ఉద్యోగులు అయిదు గంటలదాకా చాలా నిబ్బరంగా, నిదానంగా వ్యవహరిస్తారు. అయిదుగంటలకు కాఫీ సేవించి ఇక అక్కడినుంచి ఆఫీసంతా తమ ఒక్కరి కారణంగానే నడుస్తున్నట్లు కాగితాలన్నీ ముందర వేసుకు కూచొంటారు. ఇది వారి అలవాటు. ఈ అలవాటుకు కారణమేమయినా కావచ్చు. కాని, ఇది మంచి అలవాటు అని మాత్రం చెప్పలేము. ఒకవేళ మంచి అలవాటే అయినా గృహిణి దృష్టిలో మాత్రం మంచి అలవాటు కానేకాదు.

అసలు మగవాడు పెందలకడ ఇంటికి తిరిగిరావాలని కోరుకొనడంలో ఆడదాని ఉద్దేశమేమిటి అనే విషయం సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఇంటికి వచ్చి భర్త తనకు ఏదో పనిచేసిపెట్టాలనే ప్రతి భార్యా ఆశిస్తుం దనుకొనడం పొరపాటు. పగలల్లా ఆఫీసులో మగవాడు ఎంత కష్టపడి పనిచేసి ఉంటాడో, మధ్యతరగతి ఆడదికూడా ఇంట్లో పగలల్లా అంత కాకపోయినా కొంచెం ఇంచుమించుగా మరొకరకమైన శ్రమ అంటే చేసివుంటుంది. రాత్రి మళ్లీ పిల్లలను సముదాయించుకోవడం భర్త అవసరాలను చూడడం సరిపోతుంది. అటువంటప్పుడు సాయంకాలం భర్త పెందలకడ ఇంటికివస్తే కొంచెంసేపు ఇద్దరూ ప్రశాంతంగా కూర్చుని కాలక్షేపం చెయ్యాలని భార్య కోరుకోవడంలో తప్పేమిటో అర్థంకాదు. భర్త కావాలంటున్న ఉల్లాసం భార్యకు మాత్రం అవసరంలేదా? అవసరమయితే ఇరుగుపొరుగు ఆడవాళ్ళలో కాలక్షేపం చేయవచ్చునని కొందరంటారు. కాని, భర్తతో కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ కూర్చొనడంవల్ల కలిగే ఉల్లాసమూ తనవంటి ఇరుగుపొరుగు ఆడవాళ్లతో కాలక్షేపంచేసి పొందగలిగే ఉల్లాసమూ ఒకటికాదని గ్రహించడం అవసరం.

ఉల్లాసమనేది అనురక్తికి సంబంధించిన విషయం. ఒక్కొక్క వ్యక్తి ఒక్కొక్క విధంగా ఉల్లాసం సంపాదించడం సృష్టి సహజమైన విషయం.

అసలు మగవాళ్ళు పగలల్లా ఇంటికి దూరంగా వుండాలని ఎందుకు కోరుకొంటారు? అనేక కారణాలను చెబుతారు. చాలీచాలని జీతం. నిరంతరం వేధించే సమస్యలు. అమితంగా బాధపెట్టే ఆందోళనలవల్ల జీవితంమీద రోసి, చావలేక, బతకలేక, చచ్చీ చావకుండా, బతికీ బతక్కుండా, చచ్చి బతుకుతూ కాలక్షేపం చేస్తున్నాము. ఇటువంటి మాకు ఇంటిని చూస్తే భయమని కొందరు వాదిస్తారు. ఇది సమంజసమయిన వాదం కాదు. వాస్తవమూ కాదు. ఒకవేళ ప్రస్తుత సాంఘిక ఆర్థిక పరిస్థితుల కారణంగా కుటుంబమంటే భయం పుట్టేమాట నిజమే అయినా కుటుంబజీవితానికి దూరంగా వుండి ఆ భయం పోగొట్టుకోవడం సాధ్యం కాదు. పరిస్థితులను సమగ్రంగా అర్థంచేసుకొని శక్తిసామర్థ్యాలను రాణింపచేసుకొని సంపాదన ఎక్కువ చేసుకోవాలే గాని నాకు సంసారమంటే భయం అందువల్ల పగలల్లా ఇంటికి దూరంగా మసలుకుంటాననడం సబబు కాదు.

ఇక రెండవ ఉదాహరణలోని సుబ్బారావు భార్యసంగతి తీసుకుందాము. మొదట చెప్పిన సంఘటనలోని వ్యక్తుల ప్రవృత్తికి యీ ఉదాహరణలోని వ్యక్తుల ప్రవృత్తి పూర్తిగా విరుద్ధం. సుబ్బారావు ఓ బళ్లో పంతులుద్యోగం చేస్తున్నాడు. చెప్పుకో తగ్గ ఆస్తి యేమీ లేదు. గుట్టుగా సంసారం నెట్టుకురావాలని అతని అభిమతం ఇంట్లో





వున్నంతసేపూ పిల్లలతో కాలక్షేపం చేస్తాడు. పిల్లలకుకూడా సుబ్బారావంటేనే ఎక్కువ ప్రేమా యేమిటి అనిపిస్తుంది. సుబ్బారావుకు స్నేహితులేమీ లెక్కువకారు. ఆ స్నేహితులతో ఎంతవరకు మాట్లాడాలో అంతవరకే మాట్లాడతాడు. సమయాన్ని బట్టి "వస్తా కొంచెంపని ఉన్నది" అని చెప్పి ఇంటికి తప్పించుకు వస్తాడు. ఇట్లా ఎందుకు వస్తాడూ? అది అతని అలవాటు. వీలయినంతవరకూ జీవితాన్ని గుట్టుగా నెట్టుకురావాలని అతని కోరిక. ఆ కోరిక కారణంగానే తన భార్యకూడా యిరుగు పొరుగమ్మలతో ముక్తసరిగా వుండాలంటాడు. సుబ్బారావు భార్య సావిత్రి చిన్నతనంలో పదిమంది తిరిగేయింట్లో గడపడంవల్ల ఇంట్లో పని అయినా కాకముందే పొరుగింటి వాళ్లతో చక్కట్లు మొదలెడుతుంది. అది ఆమె అలవాటు. సంసారాన్ని గుట్టుగా నెట్టుకురావాలని కొంతకు కొంతగా ఆమెకూ తెలుసు. కాని, నలుగురు ఆడవాళ్లూ ఒక్కచోట కూర్చునేటప్పటికి ఆ మాట మీదా, ఈ మాటమీదా ఏదో లోకాభిరామాయణం రావడం చివరికి మాటి విరుపులతో నాటి సమావేశం పరిసమాప్తం కావడమూ పరిపాటి. ఇటువంటి గొడవ సుబ్బారావుకు పనికిరాదు. కాని, ఏం చేస్తాడూ? భార్య అలవాట్లను మార్చాలి. అది అంత సులభంగా అయ్యేపని కాదు.

ఇవి బయటి వాతావరణానికి నడవడికీ సంబంధించిన అలవాట్లు. ఒకే యింట్లో ఒకరికొకరు చేదోడు వాదోడుగా బ్రతకవలసిన భార్యాభర్తల అలవాట్లలో సర్దుబాటు చాలా అవసరం. అన్నంతినే పద్ధతి, దుస్తులు వేసుకునే పద్ధతీ మొదలయినవన్నీ అలవాట్లే. ఈ అలవాట్లను అర్థంచేసుకోవాలంటే సహనం కావాలి. సహనం ఉన్నా లేకపోయినా కొంతకాల మయ్యేసరికి సరిపెట్టుకుపోవడమనేది ఎటూ జరుగుతుంది

మధ్య తరగతి కుటుంబాలలో సాధారణంగా భర్త అలవాట్లకు వీలుగా భార్య సర్దుకుపోవడానికి ప్రయత్నిస్తుంది.

కొంచెం కలవారి కుటుంబాలలో భార్యాభర్తలు ఎవరి అలవాట్లను వారు అనుసరించే అవకాశం వున్నది.


బాగా సిరిసంపదలు కలవారి కుటుంబాలలో యీ అలవాట్లు అనేవి వ్యక్తిత్వానికి సంబంధించిన విషయాలుగా పరిణమించి అనేక సమస్యలకు కారణం కావచ్చు. లేదా అట్టి అలవాట్లు గల భార్యాభర్తల సంతానం విశిష్టమైన వ్యక్తి



# అలవాట్లు

త్వాన్ని అలవరచుకొన్నా ఆశ్చర్యపడవలసిన అవసరం కనిపించదు. ఈ రెండూ కాక ఇట్టి అలవాట్లున్న భార్యాభర్తల చెప్పుచేతలలో పెరిగిన పిల్లలు ఎందుకూ కొరగానివాళ్ళుగా తయారయినా కూడా ఆశ్చర్యపడవలసిన అవసరం అంతకన్నా కనిపించదు.

ఎందుచేతనంటే "నువ్వు నువ్వే నేను నేనే. నువ్వు దిగిరావద్దు. నేనూ దిగిరాను" అనే దృక్పథం దేనికయినా ఉపయోగపడుతుందేమోగాని సంసార జీవితానికీ, పిల్లల పోషణకూ ఎంతమాత్రం పనికిరాదు.




అంతమాత్రాన వ్యక్తిగత జీవితమనే దానికి సంసార జీవితంలో అవకాశమనేది ఎంతమాత్రం లేదని కాదు. వ్యక్తిగత జీవితమూ, భార్యాభర్తల మధ్య రహస్యాలూ ఉండడం సహజమే. కాని, వీలయినంత వరకు అవి సంసారమనే హద్దుకు సమన్వయం కావాలి. దీనినే కలుపుగోలుతనమని చెప్పుకోవచ్చు.

అందుచేతనే సంసార జీవితంవల్ల ప్రజాస్వామిక సంప్రదాయాలు అలవడుతవని కొందరంటారు. గృహస్థాశ్రమమనేది ఆశ్రమాలలోకల్లా ఉత్తమమని మన పూర్వీకులన్నారు.

ఇంతకూ ఒకరి నొకరు అర్థంచేసుకోంటేనే గాని వివాహం పనికిరాదని అంటున్నారుగదా? మరి ఒకరి నొకరు అర్థంచేసుకొనడమంటే యేమిటి? వరుడు వధువునూ, వధువు వరుణ్ణీ అర్థంచేసుకోంటే ఇక ఆ సంసారం సుఖపడుతుందనే మాట ఖాయమేనా? ఈ భార్యాభర్తలు బ్రతకవలసిన సమాజం మాట యేమిటి?

అత్తవారింటి అలవాట్లు కోడలుకు సరిపడవలసిన అవసగం ఉన్నదిగదా? అత్తవారింటి అలవాట్లను అర్థంచేసుకొని, వాటిని సహించి, తన అలవాట్లతో కోడలు సమన్వయం చేసుకొనవలసిన అవసరం ఉన్నది గదా! అలా కాదు. మేము సంపాదించుకుని బ్రతుకుతాము కనుక మా తల్లిదండ్రుల అలవాట్లూ, సంస్కారంతో మాకేమి సంబంధమని కొందరు అనవచ్చు. ఇలా అనడంలో అర్థం ఏమిటి? పెండ్లికావడంతో తమ తల్లిదండ్రులు, అక్కచెల్లెళ్ళు, అన్నదమ్ములతోటి సంబంధ బాంధవ్యాలన్నింటికీ తిలోదకాలు ఇస్తామనేనా ఇలా వాదించేవారు చెప్పేది. వీరు దూరంగా వేరేవుంటే మాత్రం రాకపోకలూ, ఆప్యాయతా, కష్టసుఖాలలో సానుభూతి అనండాలూ అనేవి అవసరమే లేదా? ఇటువంటివి లేకపోతే జీవితం దుర్భరం కాదా?

ఆధునిక విజ్ఞానం ఎంతగా అభివృద్ధిచెందినా స్వేచ్ఛాపిపాస ఎంత ఎక్కువయినా మానవుని సహజాతాలు, వాసనలు అనేవి అంతగా మారలేదు. కనుక సహజంగావుండే అలవాట్లను ధిక్కరించితే ఆ జీవితం చాలా బాధాకరంగా వుంటుంది. కాబట్టి భార్యాభర్తలు ఒకరి అలవాట్లనొకరు మన్నించి గౌరవించి సాధ్యమైనంతవరకూ సమన్వయం చేసుకోవలసిన అవసరం ఎంతయినా ఉన్నది. ★